క్లుప్తంగా

మందకృష్ణ మాదిగకు దివ్యాంగుల వినతి

జమ్మికుంట: జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సన్నాహక మహాగర్జన సదస్సులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగకు జమ్మికుంట దివ్యాంగులు సంఘం నాయకులు సమస్యల పరిష్కరించాలని గురువారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, రాజకీయాల్లో రిజర్వేషన్ కల్పించాలని, మంచానికి పరిమితమైన దివ్యాంగులకు పర్మినెంట్ సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని, పింఛన్ రూ.ఆరువేలకు పెంచాలని, సికిల్‌సెల్ ఎనీమియా, డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో జమ్మికుంట దివ్యాంగుల సంఘం నాయకులు నేరపాటి రవి, శనిగరపు రమేష్, ముత్యాల రంగయ్య, చేరాల వైకుంఠం, బాసరి రఘుపతి వరికుప్పల శోభా పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన



రాష్ట్రపతి నిలయం వద్ద విద్యార్థులు

మానకొండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర విద్యార్థులు సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని గురువారం సందర్శించారు. విద్యార్థులకు రాజనీతిశాస్త్రం, రాష్ట్రపతి అధికారాలు, ఇతర అంశాలపై అవగాహన క్షేత్ర పర్యటనతో సాధ్యమవుతుందని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు.

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



కూనవానిపల్లెలో వనమహోత్సవం

గన్నేరువరం: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని చాకలివానిపల్లె గ్రామ శివారు కూనవానిపల్లె చెరువు కట్టపై తిమ్మాపూర్ సర్కిల్ ఎక్సైజ్ సీఐ బాబా ఆధ్వర్యంలో అధికారులు గురువారం గౌడ సంఘం సభ్యులతో కలిసి సుమారు ఐదువందల ఈతమొక్కలు నాటారు. అలాగే వివిధ గ్రామాల్లో గీత కార్మికులు సేకరించిన కల్లు శాంపిల్ తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీరాజంగౌడ్, మండల కోశాధికారి రాజ్‌కోటిగౌడ్, గ్రామ ఉపాధ్యక్షుడు తిరుపతిగౌడ్, గ్రామ కోశాధికారి మల్లేశంగౌడ్, కోటేశ్వర్‌గౌడ్, వివేకానంద యూత్ అధ్యక్షుడు సురేశ్, అచ్చుత్‌గౌడ్, రాముగౌడ్, నర్సయ్యగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న సంజీవరెడ్డి

ఇల్లందకుంట: ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు. ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట మండల కమిటీని ప్రకటించారు. నియోజకవర్గ కార్యదర్శిగా ఆరె రమేశ్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్రా భూమిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడిగా రేణిగుంట్ల లచ్చయ్య, కార్యదర్శిగా గురుకుంట్ల రాజీరును నియమిస్తూ సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేసి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రావుల రాజబాబు, మల్లారెడ్డి, రాజయ్య,తాడెం దిలీప్, సంగే లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్లూ కలర్ డే



వేడుకల్లో విద్యార్థులు, టీచర్లు


హుజూరాబాద్: పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్‌లో బ్లూ కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ వేణు మాధవ్ మాట్లాడుతూ బ్లూ కలర్ సృజనాత్మకత, తెలివితేటలను ప్రదర్శించే చల్లని, ప్రశాంతమైన రంగు అని, విద్యార్థులు తమ కార్యకలాపాలను మరింత సమగ్రంగా చేయడానికి బొమ్మలు, అలంకరణ వస్తువులు, డ్రాయింగ్ వంటి విభిన్న వస్తువులను తీసుకురావడం జరిగిందన్నారు. చిన్నారులు వినూత్న ఆటలు నేర్చుకోవడానికి, ఆలోచనలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలగానే ‘చల్లూరు’ మండలం

- జిల్లాల పునర్విభజనలోనే చల్లూరును మండలంగా ప్రతిపాదన
- గ్రామాలు, హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు
- ప్రతిపాదనలకే పరిమితమైన వైనం
- ఈ విషయంపై మంత్రిని కలవనున్న గ్రామస్తులు



చల్లూరు గ్రామం



మండల మ్యాప్

వీణవంక: చల్లూరును మండలం చేయాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. గత ప్రభుత్వం ప్రకటించిన కొత్త మండలాల జాబితాలో చల్లూరు ఉన్నా.. అనివార్య కారణాలతో మండలంగా అధికారులు ప్రకటించలేకపోయారు. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లోపు మండలంగా ప్రకటించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. త్వరలోనే పార్టీలకతీతంగా నాయకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రిని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జిల్లాల పునర్విభజనలోనే వీణవంక మండలంలోని చల్లూరు గ్రామాన్ని మండలంగా మార్చాలనే ప్రతిపాదనలు జరిగాయి. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో వెళ్లి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. ఇక చల్లూరు మండలంగా ఏర్పడుతుందని అందరూ భావించారు. కానీ మండలంగా చేయాలనే ప్రతిపాదన నివేదికల వరకే పరిమితమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిరాశ చెందారు. విస్తీర్ణంపరంగా వీణవంక కంటే చల్లూరు పెద్ద గ్రామ పంచాయతీ. చల్లూరు పరిధిలోనే వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరగడం, కరీంనగర్‌కు సమీపంలో ఉండడం ఇక్కడ ప్రజలకు కలిసొచ్చేది. స్థానిక ఎన్నికలు సమీపిస్తుండడంతో మండలం చేయాలనే ప్రతిపాదనలు ఊపందుకుంటున్నాయి. గతంలోనే గ్రామాలను విభజించి హద్దురాళ్లను సైతం అధికారులు ఏర్పాటు చేశారు.

చల్లూరు మండలంగా ఏర్పడితే విలీనమయ్యే గ్రామాలు

మామిడాలపల్లి, ఇప్పలపల్లి, ఎల్బాక, గంగారం, బొంతుపల్లి, ఘన్ముక్కుల, కిష్టంపేట, దేశాయిపల్లి, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, నర్సింహులపల్లి, చల్లూరు, మల్లన్నపల్లి, మానకొండూర్ మండలం పచ్చునూరు.

చల్లూరు గ్రామ వివరాలు	
జనాభా	7,560
ఓటర్లు	4,250
కుటుంబాలు	1,320
విస్తీర్ణం	4వేల ఎకరాలు

వీణవంకకు 13, చల్లూరుకు 13 గ్రామాలు

వీణవంక మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. చల్లూరు పరిధిలో మామిడాలపల్లి, ఘన్ముక్కుల, కోర్కల్, చల్లూరు, మామిడాలపల్లి, ఎల్బాక రెవెన్యూ గ్రామాలుండగా.. వీటి పరిధిలో ఇప్పలపల్లి, గంగారం, బొంతుపల్లి, మల్లన్నపల్లి, కిష్టంపేట, దేశాయిపల్లి, నర్సింహులపల్లి గ్రామ పంచాయతీలున్నాయి. వీటితోపాటు మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామాన్ని కూడా చల్లూరులో కలిపే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వీణవంక మండలంలో రెడ్డిపల్లి, కొండపాక, శ్రీరాములపేట, హిమ్మత్‌నగర్, పోతిరెడ్డిపల్లి, బ్రహ్మణపల్లి, వీణవంక, రామక్రిష్టాపూర్, లస్మక్కపల్లి, వల్భాపూర్, నర్సింగాపూర్, కనపర్తి, బేతిగల్ గ్రామాలు కలవనున్నాయి. గతంలోనే అధికారులు హద్దులు, విస్తీర్ణం, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించి నివేదిక పంపించారు.

వ్యాపార కేంద్రంగా చల్లూరు

వీణవంక గ్రామం కంటే చల్లూరు గ్రామం భౌగోళికంగా, వ్యాపారంగా పెద్దది. చల్లూరులో అన్ని రకాల వ్యాపారాలు జరుగుతాయి. చల్లూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వీణవంక కంటే చల్లూరుకే ఎక్కువగా వెళ్తుంటారు. బ్యాంకుల లావాదేవీలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. కొంతకాలంగా చల్లూరు మండలం చేయాలనే ప్రతిపాదనలు ఊపందుకున్నా.. అమలు సాధ్యం కాలేదు. చల్లూరు మండల పరిధిలోని ప్రజలు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్‌కు నిత్యం వెళ్తుంటారు. దీంతో వ్యాపార కేంద్రంగా చల్లూరు అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతం నుంచే ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు వివిధ హోదాలో రాణించారు. రెండు రోజుల క్రితం వివిధ గ్రామాలకు చెందిన కొందరు నాయకులు చల్లూరు మండలంగా చేయాలనే ప్రతిపాదన తెచ్చినట్లు తెలిసింది. పార్టీలకతీతంగా మంత్రిని కలిసి స్థానిక ఎన్నికల్లోపే మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తేవాలని చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది.

మండలంగా ప్రకటించాలి

చల్లూరును మండలంగా ప్రకటించాలి. వీణవంక కంటే చల్లూరు వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. జిల్లాలో పునర్విభజనలోనే చల్లూరును మండలంగా చేయాలనే ప్రతిపాదన జరిగింది. మండలంగా ఏర్పడే ఆర్థిక వనరులు చల్లూరులో ఉన్నాయి. దీని పరిధిలోని గ్రామాల ప్రజలు ఎక్కువగా చల్లూరుకు వస్తుంటారు. ఆయా గ్రామాల ప్రజలు కూడా చల్లూరును మండలంగా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చల్లూరును మండలం చేస్తే రుణపడి ఉంటాం.

– సంపత్, రైతు, మామిడాలపల్లి



ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా సెంట్రల్ లైటింగ్ టవర్ ఏర్పాటు చేశారు. టవర్‌కు అమర్చిన హైమాస్ట్‌లైట్స్ కొన్ని రోజులుగా రాత్రిపూట వెలగడంలేదు. దీంతో ఆలయ పరిసరాల్లో చీకటి కమ్ముకుంటుంది. ఆలయ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కందుల సుధాకర్, ఆలయ ఈవో, సెల్ నంబర్ 98664 40753

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

వెదిరలో బోనాల వేడుకలు



వేడుకల్లో చిన్నారులు, టీచర్లు,గ్రామస్తులు

రామడుగు: మండలంలోని వెదిర అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపు, దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుధారాణి, సరళాదేవి, హెచ్‌ఎం ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యరాణి, పద్మ, సునీత, శ్వేత, గౌతమి, విజయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు అందజేత

మండల కేంద్రంలోని మడేశ్వరస్వామి బోనాల వేడుకలకు గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనుపురం పర్శరామ్‌గౌడ్ ఆలయంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన నాలుగు హైమాస్ట్ లైట్లను రజకుల సంఘం సభ్యులకు గురువారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్‌కుమార్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య తీరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్‌రూరల్: గ్రామాల్లో లో వోల్టేజీ సమస్యలను తీరుస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని పచ్చునూర్‌లో 25 కేవీ 5 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. అనంతరం విద్యుత్ అధికారులు నిర్వహించిన పొలంబాటలో పాల్గొన్నారు. ఎస్‌ఈ రమేశ్‌బాబు పచ్చునూర్ గ్రామాన్ని విద్యుత్ సమస్యల పరిష్కార దిశగా దత్తత తీసుకున్నట్లు ప్రకటించడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను తీర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో డీఈ రూరల్ తిరుపతి, టెక్నికల్ డీఈ ఉపేందర్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ, వీరాచారి, విద్యుత్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

తిమ్మాపూర్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే కాకుండా జగతికి జీవన జ్యోతులు కావాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కొత్తపల్లి సాయిరాం గార్డెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబురాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దడం, సమాజానికి ఉత్తమ పౌరులను అందించడమే కాకుండా అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ ఆర్థికంగా శక్తివంతులు కావాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మహిళలను లక్షాధికారులను చేసేందుకు కృషి చేయగా, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. అతివలు అంచెలంచెలుగా ఎదుగేందుకు వీలుగా ప్రభుత్వం వినూత్న పథకాలు చేపట్టిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఓట్ల కోసం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అందులో భాగంనే వడ్డీ లేని రుణాలు, అంతే కాకుండా ప్రభుత్వ పథకాల్లోనూ మహిళకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళా సంఘాలకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు అప్పగిస్తుందనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, ప్రాజెక్ట్ మేనేజర్లు సుధారాణి, తిరుపతి, వెంకట్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, పార్టీ మహిళా అధ్యక్షురాలు రాచపల్లి సరిత, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్‌రెడ్డి, మామిడి అనిల్ కుమార్, బుధారపు శ్రీనివాస్, చింతల లక్ష్మారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, పోలు రాము, రమేష్, మహ్మద్‌అబ్దుల్ సమద్, దుర్గాప్రసాద్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గూడ కమలాకర్, చంద్రమౌళి, అశోక్, గూడ స్వామి, అల్లాడి రఘు, అయితం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్: పట్టణంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన బాలికోన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలోకి చేరిందని, నూతన భవనం నిర్మాణానికి కృషిచేయాలని గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు హెచ్‌ఎం తిరుమల, ఉపాధ్యాయులు పల్కల ఈశ్వర్‌రెడ్డి, ఆసియ వినతిపత్రం అందించారు. శిథిల భవనంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



డబ్బులు జమైనట్లు చూపిస్తున్న లబ్ధిదారుడు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను సత్వరమే ప్రారంభించి బిల్లులు పొందాలని ఎంపీడీఓ మధుసూదన్ కోరారు. గురువారం మండలంలోని నవాబుపేటలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మండలంలోని 17 గ్రామాల్లో 304 ఇళ్లకు ముగ్గు పోయగా అందులో బేస్‌మెంటు స్థాయికి 59 చేరుకున్నాయని, వారందరికి ప్రభుత్వం రూ.లక్ష రూపాయల చొప్పున బిల్లు ఖాతాల్లో జమచేసిందన్నారు. వెంట పంచాయతీ కార్యదర్శి సంపత్, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్ పలువురు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వెంగళ పోచమ్మ (45) కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. పోచమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిందని, మృతురాలి భర్త సారయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

భయాందోళనకు గురిచేశాడని ఫిర్యాదు

శంకరపట్నం: అర్ధరాత్రి ఇంటి తలుపులు కొట్టి, కిటికీలో నుంచి టార్చిలైట్ కొడుతూ భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గుడాటిపల్లి గ్రామానికి చెందిన బూర్తుల శ్రీనివాస్, మామిడి గంగాశంకర్ ఈ నెల15న శ్రీశైలం వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అర్ధరాత్రి ఇద్దరి ఇంటి తలుపులను కొడుతూ కిటికీలో నుంచి టార్చిలైట్ వెలుతురుతో భయభ్రాంతులకు గురిచేశాడు. ఇంట్లోనివారి పక్కింటి వారికి ఫోన్ చేయగా వారు వచ్చేలోపు పరారయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజీకి ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

వారధి సెక్రటరీకి వినతి

ఇల్లందకుంట: హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లిన టేకుర్తి మోడల్ స్కూల్ నైట్ వాచ్‌మెన్ గడ్డి కొమురయ్యను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ఎలవేని అనిల్‌కుమార్ గురువారం కరీంనగర్ జిల్లా వారధి సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఆస్తి తగాదాల్లో జోక్యం చేసుకొని తన భార్యను హత్యచేసేందుకు యత్నించాడని, కొన్ని రోజులు జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ డ్యూటీలో చేరడానికి ప్రయత్నం చేస్తున్నాడని, కేసు కోర్టు పరిధిలో ఉన్నందున కొమురయ్యను డ్యూటీలోకి తీసుకోవద్దని అనిల్‌కుమార్ వినతిపత్రంలో పేర్కొన్నారు.

వ్యాక్సినేషన్‌లో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం

- చిన్నారికి మూడు వ్యాక్సిన్లకు బదులు ఐదు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ

కరీంనగర్‌రూరల్: వైద్యసిబ్బంది నిర్లక్ష్యం చిన్నారులకు ప్రాణసంకటంగా మారుతోంది. ఓ చిన్నారికి మూడు వ్యాక్సిన్లు వేయాల్సి ఉండగా ఐదు వ్యాక్సిన్లు వేసిన ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ చేశారు. పూర్తి వివరాలు.. దుర్శేడ్‌లో అనూష–మహేశ్ దంపతుల కూతురు మహిర(4నెలలు)కు ఈనెల 9న పల్లె దవఖానాలో వైద్యసిబ్బంది పీఆర్‌వీ, ఆర్‌వీవీ, పెంట వ్యాక్సిన్లు వేయాల్సి ఉండగా కొరత కారణంగా రెండు వ్యాక్సిన్లు మాత్రమే వేశారు. బుధవారం వైద్యసిబ్బంది పాపకు సంబంధించిన మెడికల్ రికార్డులు పరిశీలించకుండానే మళ్లీ మూడు వ్యాక్సినేషన్లు వేశారు. పాప తాత ఆర్‌ఎంపీ వైద్యుడు రాజమౌళి గమనించి వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. రికార్డులను పరిశీలించకుండా వ్యాక్సినేషన్ ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయగా గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, చామనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్‌లు విచారణ నిర్వహించారు. వైద్యసిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పాప ఆరోగ్యంగానే ఉందని ఎలాంటి సమస్య లేదని పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు.

మండల కేంద్రంలోనే ఆసుపత్రి నిర్మించాలి



మాట్లాడుతున్న సురేశ్, తదితరులు

గన్నేరువరం: సర్కారు దవాఖాన మండల కేంద్రంలోనే నిర్మించాలని స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు గూడూరి సురేశ్ కోరారు. గురువారం గన్నేరువరంలో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్మించాలని గురువారం చేపట్టాలనుకున్న విజ్ఞప్తి దీక్షకు అనుమతి నిరాకరించడం ప్రజాపాలన ఎలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనుమతుల పేరుతో ప్రజల ఆత్మగౌరవాన్ని పోగొట్టలేరని, గుట్టల వద్ద పనులు ఆపే వరకు ఉద్యమిస్తామన్నారు. మండల కేంద్రంలో స్థలం లేదు అనేది అవాస్తమని, అడిగే వారు లేరని ఇష్టానుసారంగా వ్యవహరించొద్దని, ప్రజల గొంతుకై నిలుస్తామని హెచ్చరించారు. సమావేశంలో యువజన సభ్యులు టేకు అనిల్, పాలేపు అజయ్, మెరుగు రాము, ఎండీ నదిమ్, పత్తి అంజి, సిరిగిరి తిరుపతి, బోయిని ప్రశాంత్, బుర్ర అచ్యుత్‌గౌడ్, తాటికొండ తిరుపతి, బత్తిని శేఖర్, బత్తిని రవీందర్, కొండ అన్వేశ్, పాక రాజు, సిరిగిరి అంజయ్య పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

మానకొండూర్: రంగపేట శివారులోని గోదాముల వద్ద సీసీ, ప్రహరీ నిర్మాణానికి రూ.1.61 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానకొండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, ఉపాధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, దేవయ్య మహేందర్, రాజు, ఓదెలు, సహదేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అందజేత



కృత్రిమ కాలుతో పద్మ

వీణవంక: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కాశిగంటి పద్మ ప్రమాదవశాత్తు కుడికాలు కోల్పోయింది. ఆలయ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్‌ను సంప్రదించగా ఫౌండేషన్ మార్గదర్శకుడు పరికిపండ్ల నరహరి చొరవతో గురువారం భగవాన్ మహవీర్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో కృత్రిమ కాలు అందించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పదేళ్లుగా విద్య, వైద్యం, ఉపాధి కార్యక్రమాలు చేస్తున్నామని, ఇవేకాక కంటికి సంబంధించి ఉచితంగా సర్జరీలు చేస్తున్నామని ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గంగారం మాజీ సర్పంచ్ కూరపాటి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వరుణ దేవుడు కరుణించాలని..

గన్నేరువరం: వర్షాలు కురువక అన్నదాతలు ఆగమవుతున్నారు, పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. వరుణ దేవుడు కరుణించాలని మండలంలోని మైలారం గ్రామంలో గురువారం రైతులు, గ్రామస్తులు కప్పతల్లి ఆడారు. అనంతరం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

కేసీఆర్ పాలనలో చెప్పలేనంత అవినీతి



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్: తొమ్మిదేళ్ల ఆరు నెలల టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో చెప్పలేనంత అధికార దుర్వినియోగం, అవినీతి జరిగిందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. గురువారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశ్రాంత ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావుపై జరిగిన ఏసీబీ దాడుల్లో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని అన్నారు. అదేవిధంగా జీహెచ్‌ఎంసీ, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, ఇరిగేషన్ డిపార్టుమెంట్లు కేసీఆర్ పరిపాలనలో అవినీతి మయంగా మారాయని తెలిపారు. అవినీతి జరిగిన లక్షల కోట్ల డబ్బు ఏ ఏ దేశాల్లో ఎవరు దాచుకున్నారో దర్యాప్తు చేయించాలన్న బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ నాయకులు పాల్గొన్నారు.